
సాక్షి సంగారెడ్డి

శుక్రవారం : 30 : మే : 2025



ఫోన్ వస్తేనే ఎంపిక..

బ్యాంకు నుంచి ఫోన్ వస్తేనే రాజీవ్ యువ వికాసానికి ఎంపికైనట్లు లేకుంటే అంతేనని ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



వర్షాకాలంలో జీవాలు భద్రం

తొలకరి వర్షాల కారణంగా గొర్రెలకు చిటుకు వ్యాధి సోకే ప్రమాదముందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వివరాలు 8లో



వర్షాకాలం.. వైర్లతో పైలం

వర్షాకాలంలో విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పీఆర్‌సీని ప్రకటించాలి

జిల్లా టీపీటీఎఫ్ డిమాండ్

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 50% ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జోగిపేటలోని మండల వనరుల కేంద్రం వద్ద గురువారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్, కార్యదర్శి చంద్రప్రకాశ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రభుత్వం డీఏను వెంటనే ప్రకటించాలన్నారు. అదేవిధంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అందోలు మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సర్ఫరాజ్ అలీ, జిల్లా కౌన్సిలర్ ఎంఏ అజీం తదితరులు పాల్గొన్నారు.

కూలీల బకాయిలు చెల్లించాలి



కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నర్సింలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధి హామీ కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు డిమాండ్ చేశారు. మండలంలోని ఆత్మకూర్,యెట్టిగడ్డసంఘం గ్రామాల్లో గురువారం పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కూలీ రోజుకు రూ.800లకు పెంచాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు రోజువారి కూలి డబ్బులు చెల్లించడంలో నెలల తరబడిగా చెల్లించకపోవడంతో వారి జీవనానికి ఇబ్బంది కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్,శివయ్య,సాయిబాబా,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వానికి తపస్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న దత్తాత్రి

నారాయణఖేడ్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలన్నీ వెంటనే చెల్లించి పాఠశాలల పునఃప్రారంభానికి ముందే టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఖేడ్‌లో గురువారం నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి మాట్లాడుతూ..పీఆర్సీ గడువు ముగిసినందున పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా, డివిజన్ బాధ్యుడు చంద్రశేఖర్, మల్లయ్యస్వామి, సంజీవ్ కుమార్, రతన్‌సింగ్, జగదీశ్వర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించండి

టీఎస్ యూటీఎఫ్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నారాయణఖేడ్: నాణ్యమైన విద్యకోసం విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ విజ్ఞప్తి చేశారు. బడిబాట జాత కార్యక్రమంలో భాగంగా గురువారం ఖేడ్ మండలం జుజాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ...గ్రామంలో గత ఆరేళ్లుగా ప్రభుత్వ బడి మూతపడటంతో విద్యార్థులను ఆటోల్లో ఖేడ్‌కు పంపిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో టీచర్‌ను నియమిస్తే పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల తెరిపించి ఇంగ్లిష్ మీడియంలో బోధన చేసేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఏశప్ప, నరేశ్, శ్రీరాంనాయక్, యాదయ్య, శ్యాంరావు, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

ఎంఎస్‌పీ పెంపుతో పలు పంటల సాగుపై ప్రభావం

- కొద్ది కాలంగా తగ్గుతున్న పప్పు, నూనె పంటల సాగు
- జిల్లాలో పప్పుధాన్యాలు, నూనె పంటల విస్తీర్ణం అధికం
- పత్తి పెరుగుదలతో వాటిపై ప్రభావం



నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందిస్తూ 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని రైతులకు మేలు చేకూరనుంది. ముఖ్యంగా పప్పుదినుసుల సాగుకు ఈ పెంపు ఉపయుక్తంగా మారనుంది. జిల్లాలో ఆయా రకాల పంటలసాగు విస్తీర్ణాలపై ఈ ధర పెంపు ప్రభావం చూపనుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఏటికేడు పత్తి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఈ పంట విస్తీర్ణం పెంపు ఇతర పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తిండిగింజలపై అధిక ప్రభావమే చూపింది. గతేడాది ఖరీఫ్‌లో 1,42,634.92 హెక్టార్లలో పత్తిపంటను సాగు చేయగా ఈ ఏడాది 1.43,817.81హెక్టార్లలో సాగు జరగనుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అదేవిధంగా వరి గతేడాది 60,792.41హెక్టార్లలో సాగు కాగా ఈసారి 59,424.7హెక్టార్లుగా నిర్ధారించారు. గతేడాది కంది పంట 31,218.77 హెక్టార్లు సాగుచేయగా ప్రస్తుతం 32,044.53హెక్టార్లుగా అంచనా వేశారు. వీటితోపాటు ఇతర నూనె, ఇతర పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో అత్యధికంగా పప్పు దినుసులు, నూనె గింజల సాగు జరుగుతుండగా సంగారెడ్డి నియోజకవర్గంలో మోస్తారుగా పప్పు దినుసులు వేస్తారు. ఏడెనిమిదేళ్లుగా పప్పుదినుసులు సాగు గణనీయంగా పడిపోతూ పత్తిపంట సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. నూనెగింజలు, జొన్న తదితర పంటలపై కూడా పత్తిపంట పెంపు ప్రభావం భారీగానే ఉంది.

వరిపై ప్రభావం చూపనుందా!

మద్దతు ధర పెంపులో భాగంగా కేంద్రం పత్తి పంటకు కూడా ధరను పెంచింది. పత్తికి ధర పెరుగుదల వరి పంటపై ప్రభావం చూపే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పత్తి పంట నీటి తడులు తక్కువగా అవసరం కాగా వరితో పోలిస్తే పత్తి పంటకు పెట్టుబడులు కూడా కొంత తక్కువగా ఉండనున్నాయి. బీటీ రకాల పత్తి పంటలు కావడంవల్ల దిగుబడులు పెరగడం, పంట కోత సమయాల్లో ధర అధికంగా లభించగలదనే భావన రైతుల్లో ఉంది.

నూనె, పప్పు ధాన్యాల సాగు పెంపుకోసం

నూనె గింజలు, పప్పుధాన్యాలు, పోషక తృణ ధాన్యాల పంటలను ప్రొత్సహించనున్నట్లు కేంద్రం తెలిపింది. కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు పంటల విస్తర్ణంతోపాటు తృణధాన్యాల సాగు కాస్త పెరిగే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ సారి పప్పుధాన్యాలు, నూనె గింజల పెంపును అధికంగా రైతులు చేపట్టేలా ప్రొత్సహించనున్నట్లు చెబుతున్నారు. గతేడాది మద్దతు ధరకంటే బయటి మార్కెట్‌లో కంది, పెసర, మినుము ధరలు అధికంగా ఉన్నాయి. నాలుగైదేళ్లుగా ఈ పప్పు ధాన్యాల ధరలు బయటి మార్కెట్‌లోనే అధికంగా ఉంటున్నాయి. ఈ పంటలకు కేంద్రం తాజాగా మద్దతు ధర పెంచిన నేపథ్యంలో వీటి సాగు కూడా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

వివిధ పంటలకు మద్దతు ధర ఇలా..

పంట	2024- 25	2025-26	పెంపు
పత్తి మీడియం	7,121	7,710	589
పత్తి పొడుగు పంజ	7,521	8,110	589
వరి కామన్	2,300	2,369	69
కంది	7,550	8,000	450
పెసర	8,682	8,768	86
మినుము	7,400	7,800	400
జొన్న	3,371	3,699	328
సోయాబీన్	4,892	5,328	436
పొద్దుతిరుగుడు	7,280	7,721	441
నువ్వులు	9,267	9,846	579

ఖరీఫ్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం వివరాలు (హెక్టార్లలో)

పంట	2024 సాగు విస్తీర్ణం	2025 (అంచనా)
పత్తి	1,42,634.92	1,43,817.81
వరి	60,792.41	59,424.7
కంది	31,218.77	32,044.53
పెసర	5,456.77	5,749.39
మినుము	3,602.04	3,465.59
సోయాబీన్	29,136	29,817.81

పారిశుద్ధ్యం ప్రశ్నార్థకం..!

- గ్రామాల్లో సర్పంచుల్లేరు.. పంచాయతీల్లో డబ్బుల్లేవు
- వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు
- వర్షాలు కురుస్తుండటంతో పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు



సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో లోపించిన పారిశుద్ధ్యం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం సర్పంచులు లేరు. ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన నిధులు కూడా గత పది నెలలుగా జాడ లేవు. దీంతో ఈ వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు నిధులు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

సాధారణ నిధులే ఆధారం..

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఏడాది కాలంగా జాడలేవు. ఆయా గ్రామాల జనాభా ఆధారంగా మంజూరు చేసే ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావడం లేదు. 2024 జూలై నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదు. అలాగే 2024 ఆగస్టు నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో పారిశుద్ధ్య నిర్వహణకు సాధారణ నిధులే ఆధారమయిన పరిస్థితి ఏర్పడింది. అయితే కాస్త పట్టణీకరణ జరిగిన గ్రామ పంచాయతీలు, పట్టణాలకు దగ్గరగా ఉన్న పెద్ద గ్రామ పంచాయతీలను మినహాయిస్తే మారుమూల గ్రామ పంచాయతీలకు ఈ సాధారణ నిధులు నామమాత్రంగానే ఉంటాయి. దీంతో చిన్న చిన్న పంచాయతీలకు పారిశుద్ధ్యం నిర్వహణలో ఇబ్బందులు ఎదురు కానుంది.

ఈ పనులకు నిధులేవి?

జిల్లాలో ప్రస్తుతం 631 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వర్షాకాలం వస్తే పారిశుద్ధ్యం నిర్వహణ కోసం బ్లీచింగ్ పౌడర్, సున్నం, ఆయిల్‌బాల్స్, బయోతిన్ వంటి అవసరం ఉంటాయి. వీటి కొనుగోలుకు చాలా గ్రామ పంచాయతీల్లో నిధులు అవసరం ఉంటాయి. అలాగే చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు కావాలి. అయితే చాలా చోట్ల ట్రాక్టర్లు నిర్వహణ లేకపోవడంతో అవి పనిచేయడం లేదు. వీటి మరమ్మతులు చేయించేందుకు నిధులు అవసరం ఉంటాయి. అయితే గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేసే మల్టీ పర్పస్ ఉద్యోగులకు గతంలో జీతాలు కూడా సరిగ్గా వచ్చేవి కావు. కానీ, ప్రభుత్వం గత కొన్ని నెలల నుంచి ఈ ఉద్యోగులకు ప్రతీనెలా వేతనాలు చెల్లిస్తోంది. కానీ, పారిశుద్ధ్యం పనులు చేసేందుకు అవసరమైన వాటికి నిధులు మాత్రం విడుదలడం లేదు.

ప్రత్యేకాధికారులు చొరవ చూపేనా?

గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం సర్పంచులు లేరు. ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. సర్పంచులు ఉంటే ప్రతిష్టకోసమైనా తమ సొంత నిధులు ఖర్చు చేసి, ప్రభుత్వం నుంచి మంజూరయ్యాక తీసుకునేవారు. అయితే ఇప్పుడు సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు ఈ దిశగా చొరవ చూపే పరిస్థితి లేదు. వర్షాకాలం వస్తే గ్రామాల్లో అంటువ్యాధులు పొంచి ఉంటాయి. పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా గ్రామీణ ప్రాంత వాసులు అంటువ్యాధుల బారిన పడే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో పంచాయతీల కార్యాచరణ..

వర్షాకాలంలో గ్రామ పంచాయతీలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉంటుంది. పారిశుద్ధ్యం నిర్వహణతోపాటు, తాగునీటి పైప్‌లైన్లు ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా గుర్తించాల్సి ఉంటుంది. పైప్ లైన్ లీకేజీ జరిగితే తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతుంటారు. దీంతో ఈ లీకేజీలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే తాగునీటిని సరఫరా చేసే ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. వానాకాలం ప్రారంభంలోనే ఈ కార్యాచరణ పంచాయతీశాఖ ప్రారంభిస్తుంది.



నారాయణఖేడ్ మండలం బాణాపూర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

2న యువ వికాసం ప్రారంభం

సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే గూడెం సమీక్ష

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: నిరుద్యోగుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పథకాల అమలుపై ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో లబ్ధిదారులందరూ ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం

నూతన కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఏర్పడుతున్న నూతన కాలనీలకు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిటుకుల్ లో ఇషా బ్లూమ్స్ కాలనీలో రూ. 15 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఉద్యాన సాగు ప్రణాళిక ఖరారు

- పంటల సాగుకు ప్రోత్సాహకాలు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఉద్యాన పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. ఈ మేరకు రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారులు 2025–26 వార్షిక సాగు వివరాల ఉత్తర్వులు జారీ చేసింది. పండ్లతోటలతోపాటు కూరగాయలు సాగు విస్తీర్ణం పెంచే విధంగా రైతులకు అవగాహన కల్పించనున్నారు. అకాల వర్షాల కారణంగా నష్టాలు చవిచూసి తక్కువ ఆదాయం గల పంటల సాగు చేస్తున్న రైతులు పంట మార్పిడి చేసి అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ సాగు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

జహీరాబాద్ ప్రాంతంలో అధికం

జిల్లాలో జహీరాబాద్‌తోపాటు ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, కోహీర్, మొగుడంపల్లి, సదాశివపేట ప్రాంతాల్లో అధికంగా ఉద్యాన పంటలు అత్యధికంగా సాగవుతున్నాయి. అల్లం, మామిడి, బొప్పాయి, కూరగాయలతోపాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 60 శాతానికి పైగా పంటల విస్తీర్ణం జహీరాబాద్‌లోనే సాగవుతున్నా యని అధికారులు చెబుతున్నారు.



బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహకం

జిల్లాలో 2,155 హెక్టార్లలో బిందు సేద్య పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. డ్రిప్ పరికరాల కోసం జిల్లాకు మొద టి విడతగా రూ.24.78 కోట్ల అంచనాలతో లక్ష్యా న్ని నిర్దేశించారు. డ్రిప్ పరికరాల కోసం రైతులు తమ సమీప మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కూరగాయల సాగు పెంపుకోసం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా శాశ్వత పందిళ్ల నిర్మాణానికి ఒక్కో యూనిట్‌కు రూ.50వేలు రాయితీ కల్పించనున్నారు.

ఆయిల్‌పామ్ సాగోత్సాహం

జిల్లాలో 3,750 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

- రెండేళ్లలో 10వేల ఎకరాలకు విస్తరించాలని నిర్ణయం
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- జహీరాబాద్ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదన



జహీరాబాద్: జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగును విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతుండటంతో జిల్లాలో సైతం ఈ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నారు. 2023 సంవత్సరం ఆగస్టులో జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగుకు శ్రీకారం చుట్టారు. మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆయిల్‌పామ్ మొక్కలను నాటి పథకాన్ని ప్రారంభించారు. అయినా పంట సాగు పట్ల రైతులు అంతగా ఉత్సాహం చూపక పోవడంతో ఆశించిన మేర పంట సాగుకు నోచుకోలేదు. ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, మార్కెటింగ్ తదితర వాటి విషయంలో రైతులకు తగిన అవగాహన లేనందున వారిలో ఆసక్తి పెంచేలా ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలను సాగు చేస్తూ వస్తున్నారు. పలు ప్రాంతాల్లో వరి సాగు చేస్తున్నారు. వీటి నుంచి రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించేందుకు వీలుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో అల్లం, ఆలుగడ్డ, చెరకు, అరటి, బొప్పాయి లాంటి వాణిజ్య పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. చెరకు మినహా ఆయా పంటల్లో ఆశించిన మేర లాభాలు రాకపోవడంతో ఆయిల్‌పామ్ సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఈ ఏడాది 3,750 ఎకరాల్లో సాగు లక్ష్యం

ఈ ఏడాది జిల్లాలో 3,750 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయించాలని ఉద్యానవన శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వం నుంచి సానుకూలత వచ్చింది. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగయ్యింది. వచ్చే రెండేళ్లలో సుమారు 10వేల ఎకరాల్లో పంట సాగు విస్తీర్ణం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సాగుకు నేలలు అనుకూలం

జిల్లాలోని భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పంట సాగుకు ఎర్ర, నల్లరేగడి నేలలు అనుకూలంగా ఉంటాయి. నీరు నిలువకుండా ఉండే నేలలై ఉండాలి. ప్రతీ రైతుకు బోరు, విద్యుత్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలి. నాలుగేళ్ల నుంచి ప్రారంభమయ్యే దిగుబడులు 30 ఏళ్ల పాటు వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.


రాయితీలు ఇచ్చి ప్రోత్సాహం

ఆయిల్ పామ్ పంట సాగుకు రాయితీ అందించి రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో మొక్కకు రైతు రూ.20 వంతున డీడీ చెల్లించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మొదటి ఏడాది మొక్కలకు రూ.11,600, అంతర పంటకు రూ.4,200, బిందు సేద్యానికి రూ.22,518 చెల్లించనుంది. రెండు, మూడు, నాలుగు సంవత్సరాలకు గాను అంతర పంటల సాగుకు రూ.4,200 వంతున ఆర్థిక సహాయం అందిస్తుంది. నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ.50,918 రాయితీ కింద ప్రభుత్వం రైతులకు అందించనుంది.

ఝరాసంగంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదన

పంటను సాగు చేసే రైతుల కోసం జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం మండలంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. అన్ని ప్రాంతాలకు ఈ ప్రదేశం అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది జిల్లాలో 3,750 ఎకరాల్లో పంటను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. పంటను సాగు చేసుకోవడం వల్ల రైతులు ఆర్థికంగా బలపడతారు.

– సోమేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి, సంగారెడ్డి

సొంతింటి కల నెరవేరుస్తాం

ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఇందిరమ్మ ఇళ్లతో పేదల ప్రజల సొంతింటి కల నేరవేరుస్తామని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్, కడ్పల్, పోచాపూర్, గోసాయిపల్లి, అంతర్‌గాం, బోక్కస్‌గాం, నల్లవాగు, లక్ష్మణ్‌నాయక్ తండా, విఠల్‌నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు.

పట్టా భూమి ప్రకారం పరిహారం

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు

జహీరాబాద్ టౌన్: జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్) కోసం భూములు కోల్పోయిన వారందరికీ పట్టా భూమి ప్రకారమే నష్ట పరిహారం అందజేస్తామని నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రాజు స్పష్టం చేశారు. రైతులకు నష్టపరిహారం అందించేందుకు నిమ్జ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నిమ్జ్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ రాజు వందమంది రైతులకు గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ...నిమ్జ్ కోసం 12,500 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉండగా..ఇప్పటి వరకు 7,300 ఎకరాలను సేకరించామన్నారు. నిమ్జ్‌పరిధిలోని చీలపల్లి, బర్దిపూర్,రుక్మపూర్,ఎల్గొయి,ముంగికి చెందిన 454 మంది రైతులకు రెండవ విడత కింద రూ.41.7 కోట్లు పరిహారం మంజూరు కాగా, రోజుకు వందమంది రైతుల చొప్పున చెక్కులను అందజేస్తున్న సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

ఇద్దరు నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

నంగునూరు(సిద్దిపేట): రాత్రి పూట ఓ మహిళ ఇంట్లోకి చొరబడ్డ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్, ట్రైనీ ఎస్‌ఐ సౌజన్య కథనం ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన సంపంగి మహేశ్ తన స్నేహితుడు పల్లెపు సంపత్‌తో కలిసి బుధవారం రాత్రి ఓ మహిళ ఇంటికి వెళ్లారు. ఆమె గట్టిగా అరవడంతో చుట్టపక్కల వారు రావడంతో పారిపోయారు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని గొల్లగూడెం గ్రామ శివారులోని జాతీయ రహదారి 65 పక్కన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామని, వివరాలకు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సీఐ మహేష్ గౌడ్ తెలిపారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దామరచెరువు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గంగిరెడ్డి గణేశ్ (24) అపుడప్పుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఎవరైనా కూలీ పనులకు పిలిస్తే వెళతాడు. ఇటీవల హైదరాబాద్ వెళ్లిన గణేశ్ తిరిగి స్వగ్రామానికి రాగా గురువారం అతడి తల్లి ఫోన్ చేసి నేను, తమ్ముడు పనిచేస్తుంటే జులాయిగా తిరుగుతున్నావని మందలించింది. ఏదైనా పని చూసుకోమని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన గణేశ్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు.

బాలికల చెవి కమ్మలు స్నాచింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆరుబయట ఆడుకుంటున్న బాలికల చెవి బంగారు కమ్మలు(పోగులు) గుర్తు తెలియని మహిళ ఎత్తుకెళ్లింది. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలోని గొల్లవాడలో గురువారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం శ్రీకాంత్ మనీషా దంపతుల పిల్లలు యక్షిత, సహస్ర వీరితోపాటు ఇరుగు పొరుగు పిల్లలు ఇంటిముందు ఆడుకుంటున్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. ఇంతలో అటుగా వచ్చిన మహిళ పిల్లలతో మాట్లాడుతూ వారికి జామపండ్లు ఇచ్చి చెవికి ఉన్న బంగారు కమ్మలు (పోగులు) కత్తిరించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. పిల్లలు ఏడుస్తూ ఇంట్లోకి వచ్చి విషయం చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు బయటకు వచ్చిచూడగా ఎవరు కనిపించలేదు. బంగారు కమ్మలు అర తులం ఉన్నట్లు బాధితులు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ దగ్ధం



జిన్నారం (పటాన్‌చెరు): ఇంటి ముందు ఉన్న లారీ దగ్ధమైంది. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ కాలనీలోని నివాసముండే సంగమేశ్వర్ రోజులాగే తన లారీని ఇంటి ముందు బుధవారం రాత్రి నిలిపాడు. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో లారీ నుంచి ఒక్కసారిగా చెలరేగిన మంటల్లో పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టుకు వేలాడుతున్న పక్షి గూళ్లు

గిజిగాడి గూడు.. బాగుంది చూడు

చిటారు కొమ్మన వేలాడుతూ గాలికైనా, వానకైనా చెక్కు చెదరని గూళ్లు. గడ్డిపరకలు, ఆకులు, కట్టె పుల్లలు, దూది పీకలతో పక్షులు అద్భుతంగా గూళ్లు నిర్మించుకుంటున్నాయి. సహజ నైపుణ్యంతో నిర్మించిన పక్షికి ఎంత సృజనాత్మకతో.. ఒకప్పుడు చెట్లపై పక్షులు అందంగా అల్లుకున్న గూళ్లు ఆకట్టుకునేవి. మారుతున్న కాలంలో అవి మచ్చుకైనా కనిపించడం లేదు. ఈ క్రమంలో సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎల్లుపల్లి గ్రామ శివారులో గురువారం ఒకే చెట్టుపై పదుల సంఖ్యలో పక్షి గూళ్లు సాక్షి కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



గూళ్లు అల్లుకుంటున్న పక్షులు

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ పట్టివేత

కొండపాక(గజ్వేల్): అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీనీ పట్టుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... రామచంద్రాపూర్ గ్రామ శివారులో మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కు నీరు వెళ్లేందుకు కాలువ తవ్వకం పనులు జరిగాయి. ఇందులో వచ్చిన మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు గజ్వేల్, కుకునూరుపల్లి పరిసర ప్రాంతాల్లో వెలుస్తున్న వెంచర్లు, ఇతరత్ర పనుల కోసం టిప్పర్లలో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్సై జగదీశ్వర్‌తో పాటు కానిస్టేబుళ్లు రాజేష్,సంతోష్‌లతో వెళ్లి జేసీబీతో పాటు 3 టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఎస్సై ఫిర్యాదు మేరకు డ్రైవర్లు దేశెట్టి అశోక్,తురి కైలాస్,బోదాస్ మల్లేష్‌లతో పాటు జేసీబీ డ్రైవరు బాబుపై కేసు నమోదు చేశారు.

ఫోనొస్తేనే ఎంపిక.. లేకుంటే అంతే

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల్లో ఆందోళన

- ఏరియాల వారీగా బ్యాంకులకు దరఖాస్తులు
- సమాచారమివ్వని అధికారులు
- మొదటి విడత లక్షలోపు రుణాలు
- జూన్ 2 నుంచి ప్రొసీడింగ్



రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి జిల్లాలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు వస్తే స్వయం ఉపాధి పొందవచ్చని నిరుద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారు. లబ్ధిదారులు దరఖాస్తుల వెంట అర్హత సర్టిఫికెట్లతోపాటు వారి ఖాతా వివరాలు అందజేశారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు లబ్ధిదారులు ఇచ్చిన బ్యాంకులకు కాకుండా గ్రామం, వార్డుల వారీగా బ్యాంకులను ఎంపిక చేసి సంబంధిత బ్యాంకులకు పంపించారు. దీంతో లబ్ధిదారుల దరఖాస్తులు ఏ బ్యాంకుకు వెళ్లాయో తెలియని పరిస్థితి. దీంతో లబ్ధిదారులు తమ దరఖాస్తు ఏ బ్యాంకుకు వెళ్లింది. ఎవరిని సంప్రదించాలనే సమాచారం లేకుండా పోయింది. ఇదే క్రమంలో సిబిల్ స్కోర్ ఆధారంగానే పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని బ్యాంకులు ప్రకటించాయి. అయితే లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఇటీవల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

కాల్ వస్తేనే ఎంపికైనట్లు..

బ్యాంకు అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఫోన్ చేసి లబ్ధిదారుడికి సమాచారం ఇస్తేనే రాజీవ్ యువ వికాసానికి ఎంపికైనట్లు. లేదంటే ఎలాంటి సమాచారం ఉండదు. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడిగితే సమాచారం ఇవ్వడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తమ దరఖాస్తులు ఏ బ్యాంకుకు పంపించారో సమాచారం ఇవ్వాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంకులకు పంపించినవి 29,855 దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా పథకానికి ఎస్సీలు 6,711మంది, ఎస్టీలు 3461 మంది, బీసీలు 19,686 మంది, ఈబీసీలు 550 మంది, మైనార్టీలు 2,175 మంది, క్రిస్టియన్లు 55 మంది మొత్తం 32,638 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు మొత్తం 29,855 దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపించారు. అయితే మిగతా దరఖాస్తుల్లో బ్యాంకు లింకేజీ లేనివి కొన్ని ఉండగా, మరికొన్నింటికి సరైన సమాచారం లేనివి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే దరఖాస్తుదారులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చినప్పటికీ అధికారులు ఆ బ్యాంకుకు కాకుండా ఆ గ్రామం, వార్డు, ఏ బ్యాంకు పరిధిలోకి వస్తుందో సంబంధిత బ్యాంకులకు దరఖాస్తులు పంపినట్లు సమాచారం.

రిజర్వేషన్లు అమలు

ఎస్సీ కార్పొరేషన్‌లో వచ్చిన దరఖాస్తులను నూతనంగా జరిగిన ఎస్సీ వర్గీకరణ ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. ఎస్సీ ఉపకులాలైన బేడ బుడగ జంగాలు, చిందు, మాస్టి, రేలి, పిచ్చకుంట్ల, దాసరి, హొలియదాసరి, రేలంగిలతోపాటు మాదిగలు, మాలలు ఇలా కేటగిరిల వారీగా ఎవరికి కేటాయించిన వాటిల్లో వారిని ఎంపిక చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాకు 10.687 యూనిట్లు

జిల్లాకు రాజీవ్ యువ వికాసం పథకం కింద బ్యాంకు లింకేజీతో మొత్తం 10.687 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో బ్యాంకు లింకేజీ లేకుండా 3,498 యూనిట్లు, లక్షలోపు రుణాల కోసం 2632 యూనిట్లు, రూ.2 లక్షల వరకు 2261యూనిట్లు, రూ.4 లక్షల వరకు 2205 యూనిట్లు వీటితోపాటు 51 మైనర్ ఇరిగేషన్(సబ్ మెర్సిబుల్ పంపులు, బోర్లు తదితర) యూనిట్లు మంజూరయ్యాయి. కాగా మొత్తం 32,638 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ఒక్కో యూనిట్‌కు మూడు దరఖాస్తులు వచ్చాయి.

మొదటి విడత లక్షలోపు రుణాలు

రాజీవ్ యువ వికాస్ పథకం కింద మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జూన్ 2 నుంచి ప్రొసీడింగ్ చెక్కులను అందజేయనున్నారు. ఇప్పటి వరకు 90శాతం లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. రెండు రోజుల్లో మొత్తం పూర్తవుతుంది. అనంతరం లబ్ధిదారులకు సమాచారం అందజేస్తాం.

- విజయలక్ష్మి , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

అన్ని బ్యాంకులు సర్వీస్ ఇవ్వాల్సిందే..

జిల్లాలో చాలా వరకు లబ్ధిదారులు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంకులలోనే ఖాతాలు కలిగి ఉంటాయి. మిగతా ప్రైవేట్ బ్యాంకులు సాధారణ ప్రజలు ఉండే ఏరియాలోనే ఉంటాయి. కానీ వారికి మాత్రం సేవలు అందించడం లేదు. కేవలం సంపన్న వర్గాలకే సేవలందిస్తున్నాయి. ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వం చేపట్టిన పథకాలకైన ప్రైవేట్ బ్యాంకులు సర్వీసులు అందించాలన్న లక్ష్యంతో ఏరియాల వారీగా బ్యాంకులను ఎంపిక చేస్తారు.

- మూర్తి, లీడ్ బ్యాంక్ మేనేజర్

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

ఆస్పత్రి ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల ధర్నా



అన్నపూర్ణ మృతదేహం

సదాశివపేట(సంగారెడ్డి): అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే చికిత్స చేసి మహిళ మృతదేహాన్ని అప్పగించారని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సంగారెడ్డి జిల్లా మునిపిల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జగదీశ్ భార్య అన్నపూర్ణ(42) ఈనెల 22న అనారోగ్యంతో సదాశివపేట పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరింది. వారం రోజుల పాటు చికిత్స చేసిన వైద్యులు ఆరోగ్యం మెరుగుపడిందని గురువారం డిశ్చార్జ్ చేస్తామని బుధవారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటలకు అన్నపూర్ణ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. విషయాన్ని గోప్యంగా ఉంచిన ఆస్పత్రి సిబ్బంది తమ తప్పేమీ లేదని బుకాయించే ప్రయత్నం చేశారు. దీంతో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చివరకు రాజకీయ నాయకులు, పోలీసులు రంగ ప్రవేశంతో ఆస్పత్రి యజమాన్యంతో దాదాపు 4 గంటల పాటు చర్చలు జరిపారు. అనంతరం మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి



రాయిలాపూర్‌లో అవగాహన కల్పించిన అనంతరం రైతులతో శాస్త్రవేత్తలు

రాయిలాపూర్‌లో పంటలసాగుపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు అధిక దిగుబడులిచ్చే నాణ్యమైన విత్తనాలు ఎంచుకుని పంటలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించారు. గురువారం మండలంలోని రాయిలాపూర్‌లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐఐఆర్ఆర్ రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ బస్వరాజ్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, ఎస్‌బీపీజీఆర్ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రణుష, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి గ్రామంలో వానాకాలం పంటల సాగు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే ముందు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేయాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వరిలో అధిక దిగుబడినిచ్చే సన్నరకం ఏఎస్ఎం 1638, దొడ్డురకం భాగ్యనగర్ ధాన్‌–75 సాగు చేయాలన్నారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓలు సౌజన్య రైతులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడి హత్య

- నిందితుడి పరారీ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): తోటి కార్మికుడిని హత్య చేసి పరారైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... కేరళకు చెందిన నలినికుమార్(40), వారం రోజుల క్రితం కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేయడానికి మండలంలోని కాళ్లకల్ శివారులో ఉన్న కిషాన్ ఇండస్ట్రీస్‌కు వచ్చి పరిశ్రమ గదుల్లో ఉంటున్నాడు. కాగా అదే పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన మరో కార్మికుడు వడియాత నరేష్ సైతం నలీన్‌కుమార్ గదిలోనే ఉన్నాడు. ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా నలినికుమార్ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. హత్య చేసి పరారైన నరేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా మృతుడిని ఎందుకు హత్య చేశాడో వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెంటాడిన మృత్యువు

- బాలుడిని చిదిమేసిన ట్రాక్టర్ రొటోవేటర్
- మిరుదొడ్డి మండలం అల్వాలలో ఘటన



నికాస్ (ఫైల్)

మిరుదొడ్డి (దుబ్బాక): విధి రాత ఎలా రాసి ఉంటుందో ఎవరికీ తెలియదు. తన వెంట పొలానికి వద్దని, ఇంటి దగ్గరే ఉండాలని తండ్రి వారించినా వినకుండా వెళ్లిన ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బీడ కనకయ్య, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. గురువారం ఉదయం తండ్రి కనకయ్య పొలానికి వెళ్తుండగా చిన్న కొడుకు నికాస్ (5) తాను వస్తానని మారాం చేయడంతో తీసుకెళ్లాడు. తండ్రి ట్రాక్టర్ రొటోవేటర్‌తో పొలాన్ని దున్నుతున్న క్రమంలో నికాస్‌ను ఇంజిన్‌పై కూర్చోబెట్టుకున్నాడు. ప్రమాదవశాత్తు అతను జారి రొటోవేటర్‌లో పడిపోయాడు. గమనించిన తండ్రి కనకయ్య అప్రమత్తమయ్యేలోపే ఘోరం జరిగిపోయింది. ప్రమాదంలో నికాస్ ముఖం నుజ్జునుజు కాగా, ఎడమ కాలు పూర్తిగా తెగిపోయి వేరైంది. అచేతన స్థితిలో ఉన్న కొడుకు మృతదేహాన్ని పట్టుకొని తల్లిదండ్రులు విలపించడం అక్కడున్న వారిని కలచివేశాయి. కాగా బాలుడి తండ్రికి వినికిడి లోపం ఉన్నట్టు తెలిసింది. బాలుడు రొటోవేటర్‌లో పడ్డాక చేసిన ఆర్తనాదాలు అతడికి వినపడకపోయి ఉండొచ్చని గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటోను ఢీకొన్న కారు

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): రాజీవ్ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బెజ్జంకి పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శంకర్‌రావు కథనం మేరకు... మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ ఎల్లయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజులానే బుధవారం ఆటోలో పాసింజర్‌ను గుండ్లపల్లెలో దింపాడు. తిరిగి వస్తున్న క్రమంలో తోటపల్లి స్టేజీ వద్ద గల రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ఎల్లయ్యను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి



ప్రభుదాస్ మృతదేహం



వడ్డే నాగేష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులపల్లికి చెందిన ప్రభుదాస్ (33) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ద్విచక్ర వాహనంపై రంగారెడ్డి జిల్లా.. శంకర్‌పల్లి కొత్తగూడకు పనిపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వంద ఫీట్ల సర్వీస్ రోడ్డులో నాగులపల్లి శివారు అపర్ణ గేట్ సమీపంలోకి రాగానే సంధుగూడంకు చెందిన వడ్డే నాగేష్ (35) తన ద్విచక్రవాహనంతో ప్రభుదాస్ పల్సర్‌ను ఢీకొట్టాడు.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రభుదాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ నాగేష్‌ను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని రేషన్ డీలర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నందికంది శివారులో గురువారం చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ వివరాల ప్రకారం... మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బుర్జుకాడి శ్రీనివాస్(51) రేషన్ డీలర్. వ్యక్తిగత పనులపై సదాశివపేట పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వస్తుండగా, నందికంది శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలై మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుత్ వైర్లు తగిలి ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని యెట్టిగడ్డసంగం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రసూల్(11) సదాశివపేట పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చాడు. బుధవారం ఇంటి మేడపై అక్క, తమ్ముళ్లతో ఆడుకుంటుండగా ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వర్షాకాలం.. జీవాలు భద్రం

- గొర్రెలకు చిటుకు వ్యాధి సోకే ప్రమాదం
- చికిత్స కన్న నివారణ మేలు
- రైతులకు సూచనలు చేసిన పశువైద్య అధికారులు



గడ్డి మేస్తున్న జీవాలు

దుబ్బాకటౌన్: తొలకరి చినుకులు జిల్లాను పలకరించాయి. తొలకరిలో గొర్రెల పెంపకం దారులు తరుచూ నష్టాలకు గురవుతుంటారు. తొలకరి చినుకులకు మొలిసిన గడ్డిని ఎక్కువగా జీవాలు తినడం వల్ల చిటుకు వ్యాధి వస్తుంది. దీనినే నెత్తిపిడుగు, గడ్డి రోగం, పాటు రోగం అని కూడా అంటారు. ఈ వ్యాధి నివారణకు గొర్రెల పెంపకం దారులు తగు జాగ్రత్తలు పాటించాలని దుబ్బాక పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలసుందరం కొన్ని సూచనలు చేశారు. బలిష్టంగా పెరిగిన గొర్రెలు వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మేత కోసం వలస వెళ్లే గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రింజర్స్ టైప్–డీ రకం సూక్ష్మజీవులు జీవాల ప్రేగుల్లో గాలి లేని వాతావరణంలో అభివృద్ధి చెందుతాయి. ఇవి వదిలిన విషపదార్థాలు చిటుకు వ్యాధికి కారణమవుతాయి. తొలకరి చినుకులకు పెరిగిన గడ్డిని గొర్రెలు అధికంగా తింటాయి. దీని వల్ల వాటి ప్రేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది వ్యాధిని కలుగజేస్తాయి. ఈ వ్యాధి తొలకరి చినుకులు పడినప్పటి నుంచి జూలై నెలాఖరు వరకు ఎక్కువగా వస్తుంది.



బాలసుందరం, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, దుబ్బాక

నివారణ ముఖ్యం

చికిత్స కంటే వ్యాధి నివారణే ముఖ్యం. ఏటా ఏప్రిల్, మే నెలల మధ్యలో వ్యాధి నిరోధక టీకా (మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) మందలో ఉన్న జీవాలన్నింటికి తప్పకుండా వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశువైద్యాధికారికి తెలియజేసి చికిత్స, జాగ్రత్తలు పాటించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని మేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సాయంత్రం సమయంలో జీవాలను మేపకూడదు. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. జాగ్రత్తలు పాటిస్తే చిటుకు వ్యాధి బారి నుంచి జీవాలను కాపాడుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు...

ఈ వ్యాధి సోకిన గొర్రెలు సాధారణంగా ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే అకస్మాత్తుగా మరణిస్తాయి. చనిపోయే ముందు చాలా నీరసంగా ఉంటాయి. ఎగిరి కిందపడి కాళ్లు కింద కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ..బిగుసుకుని కొన్ని క్షణాల్లో చనిపోతాయి. వ్యాధి సోకిన మరి కొన్ని గొర్రెలు చొంగ కారుస్తుంటాయి. శ్వాస అధికంగా ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి మందకు చికిత్స చేయించాలి.